క్లుప్తంగా

ఘనంగా అడవిరాజులుబాబు పండగ



తామరంలో ఆలయానికి తరలి వెళ్తున్న భక్తులు

మాకవరపాలెం: మండలంలోని తామరం, పైడిపాల, తదితర గ్రామాల్లో అడవిరాజుల బాబు పండగను ప్రజలంతా వైభవంగా జరుపుకున్నారు. ఈ గ్రామాల్లో అందరూ కలసి ఒకేసారి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో పల్లెల్లో సందడి వాతావరణం నెలకుంది. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పెద్దలు పాల్గొన్నారు.

మరిడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురం మరిడిమాంబ ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయాన్ని పునర్నిర్మించి గత నెల 26న ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి గురువారం సాయంత్రం ఆలయంలో భజన, పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వేగి గాంధీ తెలిపారు.

భూముల రీసర్వేపై ఆర్డీవో సమీక్ష



తహసీల్దార్లతో రీసర్వేపై సమీక్షిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: భూముల రీసర్వేను వేగవంతం చేయాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం తహసీల్దార్లను ఆదేశించారు. తన కార్యాలయంలో గురువారం 12 మండలాలకు చెందిన తహసీల్దార్లతో రెండో విడత భూముల రీసర్వేపై ఆయన సమీక్షించారు. మండలాల వారీగా రీసర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఆయా మండలాల్లో చేపట్టిన రీసర్వే వివరాలను తహసీల్దార్లు వివరించారు. రీసర్వేపై ప్రత్యేక దృష్టిసారించి నిర్దేశించిన రెవెన్యూ గ్రామాల్లో త్వరగా పూర్తి చేయాలని ఆర్డీవో ఆదేశించారు.

కల్యాణపు లోవలో విగ్రహాల ప్రతిష్ట నేడు



ఏర్పాట్లు చేస్తున్న అర్చకులు

రావికమతం: కల్యాణపు లోవ కల్యాణపోతురాజుబాబు ఆలయం వద్ద నూతన మహాశివలింగం, విఘ్నేశ్వర, నందీశ్వరుడు, చండీశ్వరుడు, దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం ఉదయం నిర్వహించనున్నారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొంటున్నారని సర్పంచ్ గంగరాజు గురువారం తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

క్షయ నివారణ ఉద్యోగుల అధ్యక్షునిగా పెంటయ్య

అనకాపల్లిటౌన్ : జిల్లా క్షయ నివారణ ఉద్యోగుల సంస్థ అధ్యక్షునిగా ఎం.పెంటయ్య ఎన్నికయ్యారు. నూతనకార్యవర్గం ఎన్నిక జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయంలో గురువారం జరిగింది. కార్యదర్శిగా జి.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా బీవీఎస్ పద్మజ, ఉపాధ్యక్షునిగా పీపీవీ చక్రవర్తి, కోశాధికారిగా ఎస్.సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా కేఈఏ రాయ్, మరో 21 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ప్రజలు మెచ్చేలా సీఎం జగన్ సుపరిపాలన

- గడప గడపకు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



ప్రజలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను గుర్తించి వాటిని పరిష్కరిస్తూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గురువారం చౌడువాడ-1 గ్రామ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరు, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చౌడువాడ సచివాలయాలు - 1, 2 పరిధిలో పలు అభివృద్ధి పనులకు రూ.40 లక్షలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రతీ గడపకు కుళాయి కనెక్షన్ ద్వారా సురక్షిత నీటిని అందించేందుకు రూ.4.68 కోట్లతో ఇప్పటికే భూమిపూజ చేసినట్లు తెలిపారు. కొద్ది రోజుల్లోనే పనులు పూర్తయితే ప్రజలకు నీటి సమస్య పరిష్కారం కానున్నట్లు వివరించారు. గతంలో పింఛన్ పొందాలంటే పంచాయతీ కార్యాలయం వద్ద మూడు, నాలుగు రోజులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ప్రతి నెలా ఒకటో తేదీనే తలుపుట్టి వలంటీర్ అందించడం ఆనందంగా ఉందని పింఛనుదారు రాపేటి లక్ష్మి ఆనందం వ్యక్తం చేశారు. గత టీడీపీ హయాంలో ఇల్లు నిర్మాణానికి పలుమార్లు దరఖాస్తులు చేస్తే బుట్టదాఖలయ్యాయని, జగన్ సీఎం అయిన తర్వాత స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందినట్లు దొడ్డి భవాని కృతజ్ఞతలు తెలిపింది. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, వారాది అప్పారావు, ఆకుల సాయి ప్రసాద్, చల్లా సురేష్, రాజి శ్రీనివాసరావు, ఎంపీడీవో శచీదేవి, తహసీల్దార్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

నేడు చుక్కపల్లిలో గడప గడపకు

చీడికాడ: చుక్కపల్లిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరయ్యే ఈ కార్యక్రమం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుందన్నారు. పార్టీ నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ సేవలన్నీ గ్రామ సచివాలయంలోనే..

- ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



వై.బి.పట్నంలో నవరత్నాలపై వివరిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం: ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలన్నీ గ్రామ సచివాలయంలోనే లభిస్తున్నాయని, గతంలో మాదిరిగా మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం వై.బి.పట్నంలో స్థానిక పాఠశాలలో నాడు – నేడు నిధులతో మౌలిక సదుపాయాలు కల్పనకు రూ. 10 లక్షలతో సోమాలమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. పాఠశాలలో కొంతసేపు విద్యార్థులతో ముచ్చటించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరుపై అడిగి తెలుసుకున్నారు. వై.బి.పట్నం పంచాయతీని గన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొర్లె వరహాలబాబు, సర్పంచ్ గొర్లె సత్యవేణి అభీష్టం మేరకు అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గంలో రూ. 10 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేసిన గ్రామాల్లో రూ. 9 కోట్లుతో పలు అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఆయా పనులు సకాలంలో పూర్తయితే గ్రామాల్లో నూతన శోభ కనిపించనుందన్నారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శెట్టి నూకరాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొర్లె వరహాలబాబు, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు బషీర్ బేగం, జేఈలు జోగారావు, వెంకటేశ్వరమ్మ, ఏపీఎం మర్రి లక్ష్మి, సర్పంచులు సత్యవేణి, లగుడు నాగేశ్వరరావు, మిరపల వెంకటరమణ, బొడ్డు సత్యనారాయణ, జి.వి.రెడ్డి, సోమన్నదొర, జిల్లా కమిటీ సభ్యులు ఉలబాల శ్రీను, ముత్తా శివాజీ, ఇట్టంశెట్టి శ్రీను, గుడపర్తి అచ్చియ్యనాయుడు, రెడ్డి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు పోలుపర్తి వెంకటరమణ, తమరాన సత్యనారాయణ, కరక అప్పలరాజు, ఏపీవో చిన్నారావు పాల్గొన్నారు.

సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతా

- గడప గడపకు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



శింగవరంలో ప్రజా సమస్యలు వింటున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: ఎన్నికల్లో ప్రజలికిచ్చిన హామీలన్నీ నెరవేర్చి సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మండలంలోని లోపూడి, శింగవరం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడేళ్ల పాలనలో అందిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ఈ క్రమంలో వైఎస్సార్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలన్నీ అవినీతికి తావు లేకుండా నేరుగా ఇంటికే అందుతున్నాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన బాగుందని, సంతోషంగా ఉన్నామని ధర్మశ్రీకి వివరించారు. రెండు గ్రామాల్లో తన దృష్టికి వచ్చిన త్వరలోనే పరిష్కరిస్తామని ప్రజలకు ధర్మశ్రీ హామీ ఇచ్చారు. లోపూడి, శింగవరం గ్రామాల్లో కమ్యూనిటీ హాలు నిర్మాణం, నాడు - నేడు నిధులతో స్కూల్ అభివృద్ధి, రెండు మంచినీటి బోర్లుతోపాటు ఇంటింటికి కుళాయి తాగునీరు అందిస్తామని భరోసా ఇచ్చారు. శింగవరంలో శతశాతం దివ్యాంగులైన పడాల కుమారి, రేణం రామలక్ష్మిలకు మూడు వేల రూపాయల పింఛన్‌ను ఐదు వేల రూపాయలకు మార్పు చేయాలని ఎంపీడీవో సువర్ణ రాజుకు సూచించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చిన బాబు, మండల సచివాలయాల కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దేవర అప్పారావు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ అధ్యక్షులు, నాయకులు సాయం రమేష్, వేపాడ మధు, గుడాల ఆనంద్, యెనుముల వాసు, రేషం నాగు, మేరుగు బాబూరావు, వేపాడ సత్తిబాబు, రేణం సోమునాయుడు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ బోయిలకింతాడ

- వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు

దేవరాపల్లి: ప్రజల భాగస్వామ్యంతోనే జగనన్న స్వచ్ఛ సంకల్పం లక్ష్యం నెరవేరుతుందని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ బూరె బాబూరావు తెలిపారు. గురువారం బోయిలకింతాడ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో గ్రామస్తులకు పచాయతీ సిబ్బందికి, పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. బోయిలకింతాడను స్వచ్ఛ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు పారిశుధ్య సిబ్బందికి ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జనతో పాటు చెత్తా చెదారాలు వేయొద్దన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా గ్రామస్తులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఉప సర్పంచ్ కోన శ్రీను, వార్డు మెంబర్లు బొబ్బిలి రాము, అన్నం రామునాయుడు, గెంజి రామారావు, మోపాడ అప్పారావు తదితర పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పాఠశాలలకు క్రీడా కిట్ల పంపిణీ



కొప్పూరు పాఠశాల ఉపాధ్యాయుడికి స్పోర్ట్స్ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మార్పీ సిబ్బంది

రోలుగుంట: స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో హెచ్‌ఎంలకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలకు 14 రకాలు, యూపీ పాఠశాలలకు 9 రకాలు, ఎంపీపీ పాఠశాలలకు 4 రకాల క్రీడా పరికరాలు సిబ్బంది వేణు, సత్తిబాబు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో సాయిశైలజ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులు, షూస్‌తోపాటు స్పోర్ట్స్ కిట్స్ అందిస్తుందని పేర్కొన్నారు.

జగనన్న కాలనీలో తొలి గృహ ప్రవేశం



గృహ ప్రవేశం చేసిన వరలక్ష్మి దంపతులతో ఎమ్మెల్యే గణేష్ తదితరులు

మాకవరపాలెం: జగనన్న కాలనీలో తొలి గృహ ప్రవేశాన్ని ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ గురువారం ప్రారంభించారు. పెద్దిపాలెంలోని కాలనీలో సూది వరపు వరలక్ష్మికి మంజూరు చేసిన ఇంటి నిర్మాణం ఇటీవల పూర్తయింది. ఈ మేరకు వరలక్ష్మి దంపతులు గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల పథకంలో ఎందరికో సొంత గూడు కల నెరవేరిందన్నారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌లో వరిగడ్డి దగ్ధం



దగ్ధమవుతున్న వరిగడ్డి

చోడవరం రూరల్: వరిగడ్డి ట్రాక్టర్‌కు వెనుక వైపున నిప్పంటుకోగా, సకాలంలో ఫైర్ సిబ్బంది స్పందించి పెద్ద ప్రమాదాన్ని తప్పించారు. గ్రామానికి చెందిన పి.సంజీవరావు ట్రాక్టర్‌కు గురువారం సాయంత్రం టైరు బండి ట్రాలర్‌గా పెట్టి కర్రి వెంకటరమణకు చెందిన వరిగడ్డిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో లక్కవరం గ్రామంలోకి రాగానే వరిగడ్డికి వెనుక నిప్పంటుకున్న విషయం చెప్పడంతో వెంటనే చోడవరం ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ రామస్వామి తమ సిబ్బందితో ప్రమాద స్థలికి చేరుకుని మంటలార్పారు. దీంతో ప్రమాద నష్టం తీవ్రత తగ్గింది.

ఘనంగా భూలోకమాంబ పండగ

రావికమతం: ఎల్.ఎన్.పురం గ్రామంలో భూలోకమాంబ అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు రావడంతో సందడి వాతావరణం నెలకొంది. గ్రామంతోపాటు పలు గ్రామాల రైతులు, వ్యాపారులు పండగను ఏటా ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ విద్యుదీపాలంకరణతోపాటు సెట్టింగులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సర్పంచ్ గోకివాడ రమణ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పోస్టల్ ఖాతా పథకాలపై అవగాహన



పోస్టల్ ఖాతా పథకాల గురించి వివరిస్తున్న ప్రసాద్

అచ్యుతాపురం (అనకాపల్లి): ఆడపిల్లల బంగారు భవిష్యత్ కోసం సుకన్య సమృద్ధి ఖాతా దోహదపడుతుందని అనకాపల్లి జిల్లా పోస్టర్ సూపరింటెంట్ జనపాల ప్రసాద్ బాబు అన్నారు. గురువారం ఆయన స్థానిక అచ్యుత ఇంగ్లిషు మీడియం పాఠశాలలో పోస్టల్ ఖాతా, పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పల్లె శేషగిరిరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, దుప్పుతూరు పోస్ట్‌మాస్టర్ విశ్వేశ్వరరావు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల చదువులో పురోగతి కనిపించాలి



నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న ఉపవిద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్

ఎస్.రాయవరం : ఉపాధ్యాయుల పురోగతి కనిపించాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ అన్నారు. ఉప్పరాపల్లి ఉన్నత పాఠశాలను ఉపవిద్యాశాఖాధికారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నాడు నేడు పనులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం తీరును తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు పాఠం బోధించిన తరువాత విద్యార్థులతో పూర్తి చేయించాల్సిన వర్కుబుక్ కరెక్షన్స్ పరిశీలించారు. లోపాలను గుర్తించిన ఉప విద్యాశాఖాధికారి ఉపాధ్యాయులకు హెచ్చరికలు జారీ చేశారు. వారం రోజుల్లో పని తీరు మారకుంటే సంబంధిత ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు తప్పవన్నారు. మండల విద్యాశాఖాధికారి ఎ.ఎస్.ఎస్.ఎస్ మూర్తి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు

రావికమతం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో రావికమతం మండలం మర్రివలస గొల్లలపాలెం అంగన్‌వాడీ సహాయకురాలు(ఎస్సీ), బుచ్చెయ్యపేట మండలం ఎం.భూపతిపాలెం సహాయకురాలు(ఎస్సీ) పోస్టులకు ఈ నెల 13లోగా దరఖాస్తులు చేసుకోవాలని పీవో ఉషారాణి గురువారం తెలిపారు. రావికమతం కార్యాలయంలో గాని, పోస్టుద్వారా గాని దరఖాస్తులు పంపించాలని సూచించారు.

'పంటల్లో జన్యుమార్పిడి వద్దు'

తుమ్మపాల : ఆహార పంటల్లో జన్యుమార్పిడి టెక్నాలజీని నిషేధించాలని రైతు స్వరాజ్య వేదిక, ఏపీ రైతు సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో డీఆర్వో వెంకటరమణను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. పంటల్లో జన్యుమార్పిడిని ప్రవేశపెట్టకుండా ఆపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వర చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. రైతు సంఘం నాయకులు ఎ.బాలకృష్ణ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మలాడలో సరుగుడు తోట దగ్ధం



కాలిపోతున్న సరుగుడు తోట

మునగపాక : మండలంలోని ఉమ్మలాడ గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండున్నర ఎకరాల విస్తీర్ణంలోని సరుగుడు తోట అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన పల్లె మురళీకృష్ణ, అప్పలనాయుడు సరుగుడు తోట సాగుచేస్తున్నారు. గురువారం సరుగుడు తోటకు మంటలు వ్యాపించి దగ్ధమైంది. సమాచారం తెలిసి అనకాపల్లి అగ్ని మాపక శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకునేందుకు ప్రయత్నించినా సరైన మార్గం లేకపోవడంతో పంట కాలిపోయింది. రూ.3 లక్షల మేర ఆస్తినష్టం సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

అసకపల్లి సర్పంచ్‌పై కేసు నమోదు

సబ్బవరం: ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారుల విధులను ఆటంకపరచడమే కాకుండా, వారిపై రాళ్ల రువ్వి వివాదాలకు దిగిన అసకపల్లి సర్పంచ్ కర్రి నరిసింగరావుపై కేసు నమోదైనట్లు తహసీల్దార్ బి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం ఎర్రవానిపాలెంలో ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన ఆర్ఐ, వీఆర్వోతో పాటు ఇతర సిబ్బందిపై సర్పంచ్ వివాదానికి దిగి, దాడి చేశారని తెలిపారు. సర్వే నంబర్ 16లోని ఎర్రవాని చెరువులో అక్రమ నిర్మాణాలపై ఇప్పటికే అనేక సార్లు హెచ్చరించినా, పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టారన్నారు. రెవెన్యూ అధికారులపై దాడి నేపథ్యంలో సెక్షన్-353, సెక్షన్-509, ఐపీసీ 34 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్, ఆర్డీవోలకు తెలియజేశామన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

మాకవరపాలెం: స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. పీఎంఎస్ఎంఏలో భాగంగా గురువారం పీహెచ్‌సీ పరిధిలో 50 మంది గర్భిణులకు వైద్యాధికారులు శ్రీవిద్య, సీతారామలక్ష్మి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు.

మాడుగుల రూరల్: ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ యోజన(పీఎంఎస్ఎంఏ)లో భాగంగా గురువారం కె.జె.పురం పీహెచ్‌సీలో 26 మంది గర్భిణులను వైద్యాధికార్లు శివప్రసాదు పాత్రుడు, రవితేజ పరీక్షించారు. బి.పి. సుగర్, ఇతర పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి జి. కామేశ్వరి, పీహెచ్‌ఎన్ ఎం. ఇందిర, ఎంపీహెచ్‌ఈఎస్ పుష్పకాంతం పాల్గొన్నారు. కింతలి పీహెచ్‌సీలో వైద్యాధికారి కె. మాలంనాయుడు గర్భిణులను పరీక్షించారు. మాడుగుల కమ్యూనిటీ ఆస్పత్రిలో గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

చురుగ్గా సాగరం - మాడుగుల రోడ్డు పనులు



మాడుగుల- సాగరం రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

మాడుగుల: పెద్దేరు నదిపై వంతెనతోపాటు సాగరం - మాడుగుల రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ. 68 లక్షలతో 580 మీటర్లు పొడవు 18 అడుగుల వెడల్పుతో ఈ రోడ్డు నిర్మిస్తున్నారు. మోదమాంబ కాలనీ శివారు వరకు సీసీరోడ్డు నిర్మిస్తున్నట్లు ఎంపీపీ వేమవరపు రామధర్మజ తెలిపారు. ఈ పనులు పూర్తయితే సాగరం, జేడీపేట, ఎం. కోడూరు, శంకరం, తాటిపర్తి, కింతలిలతోపాటు మరో 24 గ్రామాల ప్రజలకు, చిరు వ్యాపారులకు రవాణా కష్టాలు తీరనున్నాయన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అంబరాన్నంటిన అభయాంజనేయుని సంబరం



శక్తి, కాళికామాత వేషధారణలో ప్రదర్శన

కొత్తకోట: మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట గ్రామంలో అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం గురువారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పరిసర గ్రామ ప్రజలు ఆంజనేయస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సతీమణి గుడివాడ హిమగౌరీ, తల్లి నాగమణి, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్, డైరెక్టర్ శరగడం శంకరరావు, ఎంపీ సత్యవతి భర్త డాక్టర్ కె.విష్ణుమూర్తి తదితరులు తీర్థ మహోత్సవానికి హాజరై, స్వామిని దర్శించుకున్నారు. వీరికి డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, సర్పంచ్ మలసాల ధనమ్మ సాదర స్వాగతం పలికారు. తీర్థ మహోత్సవం పురస్కరించుకుని చింతలపాలెం, ఏనుగుతుని, ఏఎస్ పేట గ్రామాలకు చెందిన నాలుగు మహిళా బృందాలతో ప్రదర్శించిన కోలాటాలు ఆహూతుల్ని విశేషంగా అలరించాయి. అలాగే కాళికామాత, ఇతర శక్తి రూపాల్లో ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పిల్లలు రంగుల రాట్నంపై తిరుగాడారు. జారుడు బల్లలపై ఆటలాడారు. తీర్థంలో ఆట వస్తువులు, వంటింటి సామాన్లు, తిను బండారాల అమ్మకాలు జోరుగా సాగాయి. డాన్స్ బేబీ డాన్స్, రేలారే రేలా తదితర సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. చుట్టు పక్కల గ్రామాల నుంచి ఉత్సాహంగా ప్రజలు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణతో రోడ్లు తళుకులీనాయి. భారీగా బాణసంచా కాల్చి, యువత సందడి చేశారు.

బీఎన్‌రోడ్డుపై గోతుల పూడ్చివేత

- వాహనచోదకులకు ఊరట



బీఎన్‌రోడ్డుపై చోడవరం వద్ద గోతులు పూడ్చుతున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

చోడవరం: ఎట్టకేలకు గతుకుల రోడ్డుకు మోక్షం కలిగింది. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చొరవతో తాజాగా అధికారులు పెద్ద గోతులను పూడ్చడంతో వాహనచోదకులకు, ప్రయాణికులకు ఊరట కలిగింది. గత ప్రభుత్వ హయాం నుంచి వెంకన్నపాలెం వయా చోడవరం, వడ్డాది మీదుగా నర్సీపట్నం వెళ్లే బీఎన్‌రోడ్డుపై పెద్ద గోతులు పడి ప్రమాదకరంగా మారింది. గత వర్షాలకు మరింతగా ఈ రోడ్డు దెబ్బతింది. గాంధీ గ్రామం, గోవాడ, వడ్డాది, బంగారు మెట్ట, టి. అర్జాపురం ప్రాంతాల్లో పెద్ద గోతులు పడి అనేక వాహనాలు ప్రమాదాలకు గురయ్యాయి. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే వాహన చోదకులు హడలెత్తిపోయేవారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల రోడ్డు విస్తరణ పనులు ఆదిలోనే నిలిచిపోవడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. ఈ పరిస్థితుల్లో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఇటీవల వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి, ఆర్‌అండ్‌బీ అధికారులను, సదరు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చారు. అత్యవసరంగా పెద్దపెద్ద గోతులన్నీ పూడ్చాలని ఆయన ఆదేశించడంతో రెండ్రోజులుగా గోతులు పూడ్చే పనులు జోరుగా చేస్తున్నారు. ఇప్పటికే మెయిన్‌రోడ్డుపై గోవాడ, చోడవరం బంకు, శివాలయం అర్చి, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, వడ్డాది ప్రాంతాల్లో గోతులను పూడ్చారు. దీనితో కాస్త రోడ్డు బాగుపడినట్టు వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్రవాహనాలు, ఆటోలపై వెళ్లే ప్రయాణీకులు కూడా కాస్త ఊరట చెందారు. అయితే రోడ్డు విస్తరణ పనులు వేగంగా పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.